

# బైబిల్‌లో ముహమ్మద్

(సల్లల్లాహు అలైహి వ సల్లం)

What the BIBLE Says about
MUHAMMAD (PBUH)
(Telugu)

# బైబిల్‌లో ముహమ్మద్

## (సల్లల్లాహు అలైహి వ సల్లం)


మూలం

**అహమద్ దీదాత్**

అనువాదం

**ఎస్.ఎమ్. మలిక్**



**తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్ (రిజిష్టర్డ్)**
సందేశభవనం, లక్కడ్‌కోట్,
హైదరాబాద్-500 002. ఫోన్: 24564583

**BIBLE LO MUHAMMAD** (PBUH)

What the BIBLE Says about
MUHAMMAD (PBUH) **(Telugu)**

**TIP Series No. 88**

Written by : Ahmed Deedaat

Translated by : S.M. Mallick

All Rights Reserved with Publishers

**9th Edition** : March 2016

Copies : 2000

Price : **Rs.20**

ISBN : 81 - 86826 - 82 - 3

Published by **Telugu Islamic Publications Trust (Regd.)**
Sandesha Bhavanam,
Lakkadkot, Chatta Bazar,
Hyderabad-500 002. India.
Phone: 24564583

Typeset by : Geeturai Graphics
Lakkadkot, Hyderabad-2.

Printed at : : Cosmic Printers
Lakkadkot, Hyderabad-2.

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడయిన అల్లాహ్ పేరుతో

# బైబిల్‌లో ముహమ్మద్

## (సల్లల్లాహు అలైహి వ సల్లం)

అధ్యక్ష మహాశయా, సోదరీ సోదరులారా!

ఈ సాయంత్రం నేను మాట్లాడుతున్న విషయం - "ముహమ్మద్ (సఅసం)ను గురించి బైబిలు చెప్పేదేమిటి?"- అనేది మీలో చాలా మందికి వింతగా తోచవచ్చు. కారణం, మాట్లాడేవాడు ఓ ముస్లిమ్. యూదులు, క్రైస్తవుల పవిత్ర గ్రంథాలలోని సమాచారాన్ని, భవిష్యద్వాణిని ఓ ముస్లిమ్ వ్యక్తి వెలికితీయడం అన్నది ఎలా సాధ్యం అన్న ప్రశ్న మీలో తలెత్తుతూ ఉండవచ్చు.

30 ఏళ్ళ క్రితం నేను యువకునిగా ఉన్న రోజుల్లో ఓ క్రైస్తవ మతాచార్యుడు చేసిన మత ప్రసంగాల పరంపర వినడం తటస్థించింది. రెవరెండ్ హైటెన్ అనే ఆయన థియేటర్ రాయల్ డర్బన్‌లో ఆ ఉపన్యాసాలు చేశాడు.

## పోపా? కెసింజరా?

ఆ రెవరెండ్ మహాశయుడు బైబిల్‌లోని జోస్యాలను చాలా వాటిని వివరిస్తూ ఉన్నాడు. క్రైస్తవుల బైబిల్‌లో సోవియట్ రష్యా ఆవిర్భావాన్ని, అంతిమ దినాలను కూడా ముందే చెప్పడం జరిగిందని నిరూపించడానికి ఆయన ప్రయత్నించాడు, ఒక దశలో ఆయన పవిత్ర గ్రంథం 'పోప్'ను కూడా వదల్లేదని, ఆయన గురించి కూడా ముందే చెప్పివేసిందని నిరూపించడానికి సయితం వెనుకాడలేదు. కొత్త నిబంధనలోని చివరి గ్రంథమైన ప్రకటన (13:18-అను.)లో ప్రస్తావించబడిన మృగము 666 మరెవరో కాదు, పోప్‌గారే అని తన శ్రోతలను

నమ్మించడానికి పాపం ఆయన పడరాని పాట్లు పడ్డాడు. పోప్‌నేమో భూమిపై క్రీస్తు ప్రతినిధిగా భావిస్తారు క్రైస్తవ సోదరులు మరి. ముస్లిములమయిన మేము రోమన్ క్యాథలిక్కులు, ప్రొటెస్టెంటులకు మధ్య ఉన్న వివాదంలో పడడం భావ్యం కాదు. ఈ సందర్భంలో మరో విషయం ఏమిటంటే క్రైస్తవ బైబిల్‌లోని 666 మృగము సరికొత్త క్రైస్తవ నిర్వచనం ప్రకారం హెన్రి కెసింజరట, క్రైస్తవ విద్వాంసులు తమ వాదాన్ని నిరూపించే ప్రయత్నంలో తమకు తామే సాటి అని చెప్పక తప్పదు.

రె. హైటెన్‌గారి ఉపన్యాసాలు నాలో ఓ ప్రశ్నను రేకెత్తించాయి. 'పోప్'ను గురించి "ఇజ్రాయేల్" రాజ్యానికి సంబంధించిన సమాచారంతో సహా అన్ని సంగతులూ కాలజ్ఞాన తత్వంలా జోస్యం చెప్పిన బైబిలు మానవతకు మహోపకారం చేసిన గొప్ప వ్యక్తి దైవప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను గురించి కొంతయినా చెప్పి ఉండదా? అది తప్పక చెప్పి ఉంటుంది. అయితే ఏమని చెప్పింది? అన్నదే ప్రశ్న.

యువకునిలో ఉండే సహజ ఉత్సాహంతో నేను దాని సమాధానానికై అన్వేషణ మొదలెట్టాను. క్రైస్తవ మతాచార్యుల్ని ఒకరి తరువాత ఒకరిని ఎందరినో కలిశాను, మరెన్నో ఉపన్యాసాలు విన్నాను. బైబిలు చెప్పిన జోస్యాలకు సంబంధించిన పుస్తకాలు దొరికినవన్నీ చదివాను. డచ్ రిఫార్మ్‌డ్ చర్చ్‌కు సంబంధించిన డామినీతో జరిపిన ఇలాంటి ఓ ఇంటర్వ్యూ ఉదంతాన్నే మీకు నేను నేటి రాత్రి వినిపించబోతున్నాను.

## కలసివచ్చిన 13

నన్ను ట్రాన్స్‌వాల్ నగరానికి ఆహ్వానించారు. అక్కడ నేను మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) జన్మదిన వేడుకల్లో ప్రసంగించవలసి ఉంది. ఆ రాష్ట్రంలో "ఆఫ్రికాన్" భాష అధికంగా మాట్లాడతారని, మావాళ్ళు కూడా ఆ భాషే బాగా అర్థం చేసుకుంటారని నాకు ముందే తెలుసు గనక ఆ భాషలో కొద్దో గొప్పో

ప్రవేశం సంపాయించాలని తద్వారా ప్రజల మధ్య సానుకూలంగా ఫ్రీగా మసలుకోవాలని అనుకున్నాను. నేను టెలిఫోన్ డైరక్టరీ తీసి 'ఆఫ్రికాన్' మాట్లాడేవారి చర్చీలకు ఫోన్ చెయ్యడం మొదలెట్టాను. మతాచార్యులకు, 'నేను వారితో సంభాషించాలని కోరుతున్నాన'ని నా అభిమతాన్ని వెల్లడించాను. వారందరూ నా విన్నపాన్ని ఏదో ఓ సాకు చెప్పి తిరస్కరించారు. 13 నాకు కలసివచ్చిన సంఖ్య. 13వ సారి నేను చేసిన ఫోను శుభవార్తను మోసుకువచ్చింది. వాన్ హీర్‌డెన్ (**Van Heerden**) అనే డొమినీ నన్ను కలుసుకొనడానికి అంగీకరించాడు. నేను ట్రాన్స్‌వాల్‌కు బయలుదేరనున్న శనివారం రోజున మధ్యాహ్నం కలుసుకోవాలని నిశ్చయమయింది.

అయన నన్ను తన వరండాలో కలుసుకుని ఎంతో స్నేహపూర్వకంగా స్వాగతం పలికాడు. నాకు అభ్యంతరం లేకపోతే తన మామగారు కూడా (ఫ్రీస్టేట్ నుంచి వచ్చిన 70 ఏళ్ళ ముసలివాడు) మన సంభాషణలో పాలుపంచుకో గలడన్నాడు. నేను అభ్యంతరం తెలుపలేదు. మేము ముగ్గురమూ డోమినీ లైబ్రరీలో కూర్చున్నాము.

## ఏమీ లేదా? ఎందుకు?

నేను ఓ ప్రశ్న వేశాను: "బైబిల్ ముహమ్మద్‌ని గురించి ఏమని అంటుంది?" అతడు నిస్సంకోచంగా బదులిచ్చాడు, "ఏమీ అనదు;" నేను ఎదురు ప్రశ్న వేశాను, "ఎందుకు? మీరు దాన్ని వివరించినదాని ప్రకారం, బైబిల్‌లో ఎన్నో విషయాలున్నాయి. సోవియట్ రష్యా గురించి, అంతిమ దినాల గురించి, రోమన్ క్యాథలిక్కుల పోపును గురించి కూడా అది చెబుతుంది కదా?" "నిజమే, అయితే ముహమ్మద్ గురించి మటుకు ఏమీ లేదు" బదులిచ్చాతడను. నేను మళ్ళీ అడిగాను, "ఏమీ లేకపోవడానికి కారణమేమిటీ? ముహమ్మద్ అనే ఈ వ్యక్తి నిస్సందేహంగా ప్రపంచ వ్యాప్తంగా విస్తరించిన కోటానుకోట్ల ప్రజల ఓ వర్గాన్ని రూపొందించిన మహనీయుడు. ఈ ప్రజలు

ఆయన ఆదేశానుసారం క్రైస్తవం గురించి ఈ నమ్మకాలు కలిగి ఉన్నారు:

1. ఏసు అద్భుతమయిన మహిమాన్వితమైన పుట్టుక.
2. ఏసుయే మెస్సయ్య = (మసీహ్) క్రీస్తు.
3. ఆయన దైవ అనుజ్ఞతో మృతులను బ్రతికించాడు. పుట్టు గ్రుడ్డులకు చూపు కల్పించాడు. కుష్టు రోగులను నయం చేశాడు.

అందువల్ల మానవుల ఆ మహానాయకుని గురించి, ఏసును ఆయన తల్లి మరియను ఎంతో ఉత్తములుగా అభివర్ణించిన ఈ వ్యక్తిని గురించి ఈ గ్రంథం బైబిల్ ఎంతో కొంత చెప్పి ఉంటుంది?"

ఫ్రీ స్టేట్ నుంచి వచ్చిన వృద్ధ మహాశయుడు నెమ్మదిగా సమాధానం పలికాడు, "నాయనా! నేను బైబిల్‌ని గత 50 ఏళ్ళుగా చదువుతున్నాను, ఆయన గురించి ఏ మాత్రం ప్రస్తావించబడి ఉన్నా నా కళ్ళబడకుండా పొయ్యేది కాదు."

## పేరుపెట్టి ఒక్కటీ లేదు

నేనడిగాను, "మీ ప్రకారం, పాత నిబంధనలో ఏసు రాకను తెలిపే వందలాది భవిష్యద్వాణులు లేవూ?" డొమినీ మధ్యలో కల్పించుకుని, "వందలు కావు, వేల సంఖ్యలో ఉన్నాయి" అన్నాడు. నేను, "నేను వేయిన్నొకటి జోస్యాలు పాత నిబంధనలో ఏసు రాకను గురించి ఉన్నాయన్నా కాదనబోవడం లేదు. ఎందువల్లనంటే బైబిలు సాక్ష్యం ప్రమేయం లేకుండానే ముస్లిమ్ జగత్తు యావత్తు ఆయన్ని నమ్ముతుంది. మేము నిజమయిన ఏసును ముహమ్మద్ పలుకులు ఆధారంగా నమ్ముతున్నాము. నేడు ప్రపంచంలో 900,000,000కు పైగా ముహమ్మద్ అనుయాయులు ఏసుక్రీస్తును దేవుని గొప్ప ప్రవక్తగా ప్రేమిస్తారు, ఆదరిస్తారు, గౌరవిస్తారు. క్రైస్తవులు తమ బైబిలు తర్కాన్ని ఉపయోగించి ముస్లిమ్‌లను నమ్మింపజెయ్యవలసిన అవసరం ఏ మాత్రం

లేదు. ఇకపోతే, ఆ 'వేల' సంఖ్యలో ఉన్న జోస్యాల్లో ఏసును పేరు పెట్టి పలికిన జోస్యం ఏ ఒక్క దాన్నయినా దయచేసి మీరు నాకు చూపగలరా? మెసయ్యా అనే పదం క్రీస్తుగా అనువదించబడింది. అది పేరు కాదు. ఖితాబు. ఆ మెసయ్యా పేరు 'ఏసు' అని, ఆయన తల్లి పేరు మేరి అని, ఆయన తండ్రిగా చెప్పుకోబడే వ్యక్తి పేరు "వడ్రంగి యోసేపు" అని, 'హేరోదు' రాజు కాలంలో ఆయన పుడుతాడని తెలిపే జోస్యం ఒక్కటైనా ఉందా? లేదే. అలాంటి వివరాలేవీ లెవ్వు. అలాంటప్పుడు ఆ వేల జోస్యాలు ఏసుకు సంబంధించినవే అని మీరెలా అనగలుగుతారు?"

# భవిష్యద్వాణి అంటే ఏమిటి?

డొమినీ సమాధానంగా, "చూడండి, భవిష్యద్వాణి అనేది, భవిష్యత్తులో జరగబొయ్యే ఒకానొక దానికి పద చిత్రం, ఆ విషయం నిజంగా సంభవించి నప్పుడు, లోగడ ఏదైతే జోస్యంగా చెప్పడం జరిగిందో అది నెరవేరినట్లు మనం గమనిస్తాము" అని పలికాడు. నేనన్నాను, "మీరు వాస్తవంగా చేసేదేమంటే, భావాన్ని వర్తింపజేస్తారు, హేతువును ఉపయోగిస్తారు. రెండును రెండు నాలుగని కూడుతారు." దానికి ఆయన, "అవును అంతే" అన్నాడు. అప్పుడు నేనన్నాను, "ఏసు అస్తిత్వాన్ని సమర్థించుకోవడానికి మీరు వెయ్యి జోస్యాల ఎడల విధానాన్ని అవలంబించడం జరిగినట్లయితే మనం ముహమ్మద్ విషయంలో అదే విధానాన్ని ఎందుకు అవలంబించకూడదు?" దానికి డొమినీ ది సమంజసమైన, న్యాయవంతమైన పద్ధతే అని ఒప్పుకున్నాడు. ఈ సమస్యను రిష్కరించడానికి ఇది హేతుబద్ధమయిన మార్గమనీ అంగీకరించాడు.

అప్పుడు నేను అతన్ని పాత నిబంధన, ద్వితీయోపదేశ కాండము తెరవమన్నాను. 18వ అధ్యాయం, 18వ వచనం తీయమన్నాను, ఆయన తీశాడు. అప్పుడు నేను ఆఫ్రికాన్ భాషలో నాకు గుర్తున్న ఆ వచనాన్ని చదివాను. (**ఈ విధంగా దక్షిణాఫ్రికాను పరిపాలించే జాతి భాషలో కొంతయినా అభ్యాసం** చెయ్యాలన్న నా లక్ష్యమూ నెరవేరుతుంది).

వారి సహోదరులలో నుండి నీవంటి ప్రవక్తను వారికొరకు పుట్టించెదను; అతని నోట నా మాటల నుంచుదును; నేను అతని కాజ్ఞాపించునది యావత్తును అతడు వారితో చెప్పును. (ద్వితి-18:18)

## మోషే లాంటి ప్రవక్త

ఆఫ్రికాన్ భాషలో వచనాన్ని చదివి, నా అస్పష్టమయిన ఉచ్చారణకై క్షమాపణ చెప్పుకున్నాను. డొమినీ నేను బాగానే చదివానని అభయమిచ్చాడు. అప్పుడు నేను అడిగాను, "ఈ జోస్యం ఎవరికి వర్తిస్తుంది?" అని. అతను ఎలాంటి సంకోచం లేకుండా "ఏసు!" అని బదులిచ్చాడు. నేనడిగాను, "ఏసు అని ఎలా చెప్పగలరు? ఆయన పేరు ఇక్కడ ప్రస్తావించబడలేదుగా?" డొమినీ ఇలా బదులిచ్చాడు, "జోస్యాలనేవి భావిలో జరగబొయ్యే విషయాల పద చిత్రాలు గనక, ఈ వచనంలోని పదాలు ఏసును సరిగ్గా వర్ణిస్తున్న విషయం కనబడుతూనే ఉంది. ఈ జోస్యంలోని అత్యంత ముఖ్యమయిన పదాలు 'నీ వంటి'- అంటే మోషే వంటి అన్నమాట. ఏసు మోషే లాంటివాడే." నేనడిగాను, "ఏసు, మోషే లాంటివారంటే అది ఏ విధంగా?" దానికి సమాధానం, "మొదటిది, మోషే యూదుడు, ఏసు కూడా యూదుడే. రెండవది, మోషే ప్రవక్త, ఏసు కూడా ప్రవక్తే. అందువల్ల ఏసు, మోషే లాంటివాడే. దేవుడు మోషేతో చెప్పిన విషయం కూడా నిక్కచ్చిగా ఇదే- 'నీవంటి' ప్రవక్త అన్నాడు. "మీరు మోషే మరియు ఏసుల మధ్య మరే విధమైన సామ్యం ఉందేమో ఊహించి చెబుతారా?" అని నేనడిగినదానికి, డొమినీ లేదని సమాధానం పలికాడు. అప్పుడు నేను, "ద్వితీయోపదేశంలోని 18:18వ వచనంలోని జోస్యానికి సరిపొయ్యేవారెవరు అని తేల్చడానికి ఈ రెండే ప్రమాణాలయితే, మోషే తరువాత వచ్చిన బైబిల్‌లో ప్రస్తావించిన అనేక ప్రవక్తలకు అవి వర్తించవచ్చు: సొలోమోను యెషయా, యెహెజ్కేలు, దానియేలు, హోషేయ, యోవేలు, మలాకీ, బప్తిస్మమిచ్చు యోహాను- వగైరా. ఎందుకంటే వీరంతా **యూదులే, ప్రవక్తలే.** ఆ జోస్యాన్ని మనం వీరిలో ఏ ఒక్కరికో ఎందుకు

వర్తింపజెయ్యకూడదు? కేవలం ఏసుకు వర్తింప జెయ్యడం దేనికి?" అని అన్నాను. డొమినీకి ఏ సమాధానమూ పాలుపోలేదు. నేను ముందుకు సాగుతూ చెప్పాను: "చూడండి, నేను యోచించిన దాని ప్రకారం, ఏసు మోషే వంటివాడు కాదు, ఆయనకు పూర్తిగా భిన్నమయినవాడు. నేనేదయినా తప్పు చెబితే మీరు దయచేసి దాన్ని సరిచెయ్యండి."

## మూడు విరుద్ధమయిన పోలికలు

ఆ తరువాత నేను ఆయన ముందు నా హేతువును ఉంచాను, "మొదటిది, ఏసు మోషేలాంటివాడు కాడు. ఎందుకంటే మీ ప్రకారం ఏసు దేవుడు. మోషే మటుకు దేవుడు కాడు. ఇది సరేనా?" అతనన్నాడు: "నిజమే" అని. "కనుక ఏసు మోషే వంటివాడు కాడు. రెండవది, మీ ప్రకారం ఏసు ప్రపంచ పాప పరిహారంగా చనిపొయ్యాడు (1 యోహాను 2:2-అను.). కాని మోషే ప్రపంచ పాపాలకుగాను చనిపోలేదు. ఇది వాస్తవమా?" అతను తిరిగి బదులిచ్చాడు. "నిజమే." నేనన్నాను, అందువల్ల ఏసు మోషేవంటివాడు కాడు! మూడవది, మీ ప్రకారం, ఏసు మూడు దినాల వరకు నరకానికి వెళ్ళాడు (రోమా 10:7-అను.). కాని మోషే అక్కడికి వెళ్ళవలసిరాలేదు. ఇది నిజమేనా? "అవు....ను.... ని....జ...మే" అన్నాడాయన బలహీనంగా. "అందువల్ల ఏసు మోషేను పోలినవాడు కాడు!" అని నేను తీర్పు చెప్పాను!

"అయితే డొమినీ," నేను మొదలెట్టాను, "ఇవి అసలు సత్యాలు కావు. గట్టి నిజాలు కావు. బలమయిన నిజాలు కావు. ఇవన్నీ నమ్మకాలు. వీటిపై చిన్న పిల్లలు మటుకే జారి పడిపోతారు. మనం దానికంటే ఎంతో సరళమయింది, సాధారణమయింది, నీ చిన్న పిల్లల్ని పిలిచి వినిపించినా అర్థం చేసుకునేందుకు ఎలాంటి కష్టం కానిది చర్చిద్దాము, ఏమంటావు?" అని నేనడిగినదానికి డొమినీ చాలా సంతోషంతో అంగీకరించాడు.

# తండ్రి, తల్లి

(1) "మోషేకు ఒక తండ్రి, ఒక తల్లి ఉన్నారు. ముహమ్మద్‌కు కూడా ఒక తల్లీ తండ్రి ఉన్నారు. కాని ఏసుకు ఉన్నది ఒక్క తల్లి మటుకే. ఏ మానవమాత్రుడూ తండ్రి కాడు. ఇది నిజమంటారా?" దానికతను, "నిజమే" అని బదులిచ్చాడు. "అయితే ఏసు, మోషేవంటివాడు కాడు, ముహమ్మద్ మోషే వంటివాడు." (నేనింతవరకు ఆఫ్రికాన్ భాషలోనే చర్చ జరుపుతున్నాను. దాన్ని నా అవసరానికిగాను ప్రాక్టీసు చెయ్యడానికి ఉపయోగిస్తున్న విషయాన్ని పాఠకులు అర్థం చేసుకుని ఉంటారు. అందువల్ల ఆ భాషను నేను ఈ వ్రాత ప్రతిలో ఉదాహరించడం లేదు).

(2) మోషే మరియు ముహమ్మద్ సాధారణ రీతిలో, అంటే, స్త్రీ పురుషుల భౌతిక కలయిక వల్ల పుట్టారు. కాని ఏసు ఓ ప్రత్యేక మహిమ ద్వారా సృష్టించబడ్డారు. మత్తయి సువార్త 1:18లో ఇలా ఉన్న విషయం మీకు తెలిసే ఉంటుంది: ".......వారేకము కాక మునుపు (వడ్రంగి యోసేపు మరియ) ఆమె పరిశుద్ధాత్మ వలన గర్భవతిగా ఉండెను." ఇంకా లూకా సువార్త ప్రకారం, ఆమెకు కలగబొయ్యే పవిత్రమైన కుమారుణ్ణి గురించి తెలిపినప్పుడు, మరియ సహేతుకంగా అభ్యంతరం వెలిబుచ్చింది: "......నేను పురుషుని ఎరుగనిదానినే. ఇదెలాగు జరుగునని దూతతో అనగా దూత- పరిశుద్ధాత్మ నీ మీదికి వచ్చును; సర్వోన్నతుని శక్తి నిన్ను క్రమ్ముకొనును......" (లూకా 1:35) అని ఉంది. దివ్య ఖుర్‌ఆన్ ఏసు మహిమాన్వితమైన జన్మను ధృవీకరిస్తుంది- అది ఎంతో ఉదాత్తమయిన, ఉత్తమమైన రీతిలో - ఆమె (మరియ) "ఓ నా ప్రభూ! నాకు పిల్లవాడెలా కలుగుతాడు - నన్ను ఏ పురుషుడూ తాకనయినాలేదే?" అని అడిగిన సహేతుకమయిన ప్రశ్నకు సమాధానంగా దైవ దూత ఇలా పలుకుతుంది: "అలాగే జరుగుతుంది. అల్లాహ్ తాను కోరినదాన్ని సృష్టిస్తాడు. ఆయన ఏదయినా చెయ్యాలని నిర్ణయించినప్పుడు కేవలం 'అగుము' అని ఆదేశిస్తాడు. అది అయిపోతుంది." **(దివ్యఖుర్‌ఆన్-3:47)**

"దేవుడు తలిస్తే మనిషిలోనైనా, పశువులోనయినా విత్తనం నాటవలసిన అవసరం ఆయనకు లేదు. ఆయన కేవలం కోరితే చాలు. అది ఉనికిలోకి వస్తుంది. ఇదీ ఏసు జననానికి సంబంధించిన ముస్లిముల నమ్మకం." (నేనొకసారి ఏసు జననానికి సంబంధించిన కుర్‌ఆన్ మరియు బైబిల్ ఉల్లేఖనాలను ఎదురెదురుగా పోల్చుతూ మా మహానగరంలోని "బైబిల్ సొసైటీ" అధ్యక్షుడి ముందుంచి అడిగాను, "మీరు మీ కుమార్తెతో ఏసు జననం గురించి చెప్పదలచుకుంటే ఆమెకు ఏ కథనాన్ని వినిపిస్తారు? ఖుర్‌ఆన్ కథనాన్నా లేక బైబిల్ కథనాన్నా?" దానికి ఆయన తలవంచుకున్నాడు. ఖిన్నవదనుడై 'ఖుర్‌ఆన్ కథనాన్నే' అని బదులిచ్చాడు) మొత్తానికి నేను డొమినీని, "మోషే ముహమ్మద్‌ల మాదిరిగా సహజసిద్ధమయిన రీతిలోకాక, దానికి భిన్నమయిన రీతిలో, అద్భుతమయిన రీతిలో ఏసు జన్మించాడన్న విషయం వాస్తవమా కాదా?" అని అడిగాను. దానికాయన సగర్వంగా, "అవును వాస్తవమే" అని బదులిచ్చాడు. అప్పుడు నేను, "అందువల్ల ఏసు మోషేకు పోలినవాడు కాడు కాని ముహమ్మద్ మోషేకు పోలినవాడు- దేవుడు మోషేతో ద్వితీయోపదేశ కాండం 18 : 18లో - 'నీవంటి'వాడు (నీకు పోలిన వాడు, మోషేకు పోలినవాడు) అని అంటున్నాడు- మోషేకు పోలినవాడు ముహమ్మదే."

## వివాహ బంధనాలు

(3) మోషే మరియు ముహమ్మద్ పెళ్ళి చేసుకున్నారు. సంతానం కలిగివున్నారు. కాని ఏసు జీవితాంతం అవివాహితుడుగానే ఉండిపొయ్యాడు, "నిజమేనా?" డొమినీ "అవును" అన్నాడు. "అయితే ఏసు మోషేవంటివాడు కాదు, మోషే వంటివాడు ముహమ్మద్ ఒక్కడే."

## తన ప్రజలచేత తృణీకరించబడిన ఏసు

(4) మోషేను, ముహమ్మద్‌ను వారి జీవిత కాలంలోనే వారి జాతి ప్రజలు ప్రవక్తలుగా స్వీకరించారు, విశ్వసించారు. యూదులు మోషేను

అంతులేని విపత్తుల్లో పడవేశారన్న విషయం, ఆయనపై వారు సతతం పిచ్చిగా సణుగుతూనే ఉన్నారన్న విషయం యథార్థమే కాని ఒక జాతిగా, చివరికి వారంతా మోషేను దైవం తరఫున తమకొరకు పంపబడిన సందేశహరునిగా గుర్తించారు, విశ్వసించారు. అరబ్బులు కూడా ముహమ్మద్ జీవితాన్ని దుర్భరం చేశారు. వారి చేతుల్లో ఆయన అనేక విధాలుగా బాధపడ్డారన్న మాట వాస్తవమే. 13 ఏళ్ళు మక్కాలో నిరంతరాయంగా బోధించే ఆయన తన జన్మస్థలమైన ఆ నగరాన్నుంచి వలసపోవలసి వచ్చింది. అయితే ఆయన మృత్యువుకు మునుపే మొత్తం అరబ్బు జాతి ఆయన్ని దైవ సందేశహరునిగా స్వీకరించింది, నమ్మింది. కాని బైబిల్ ప్రకారం -'ఆయన (ఏసు) తన స్వకీయుల యొద్దకు వచ్చెను ఆయన స్వకీయులు ఆయనను అంగీకరింపలేదు' (యోహాను- 1 : 11) "ఇంకా నేటికీ రెండు వేల సంవత్సరాలయిన తరువాత కూడా ఆయన 'స్వకీయులు'- యూదులు. ఓ జాతిగా ఆయన్ని తిరస్కరిస్తూనే ఉన్నారు. ఇది నిజమేనా?" డొమినీ అన్నాడు, "నిజమే" అని. "అందువల్ల ఏసు మోషేవంటివాడు కాడు, మోషేవంటివాడు ముహమ్మద్ మాత్రమే."

## 'పరలోకపు' సామ్రాజ్యం

(5) మోషే అయినా ముహమ్మద్ అయినా దైవప్రవక్తలుగా రాజ్యాలూ ఏలారు. ప్రవక్త అంటే నా అభిప్రాయంలో, మానవాళి మార్గదర్శకత్వానికై దైవవాణిని గ్రహించి, దేవుని సృష్టి అయిన మానవులకు తాను గ్రహించినదాన్ని యథాతథంగా ఎలాంటి మార్పులూ చేర్పులూ లేకుండా అందజేసేవాడని అర్థం. రాజు అంటే గరిష్ఠ రీతిలో తన పాలితులకు మరణ శిక్ష విధించడానికీ, వదలిపెట్టడానికీ అధికారం గలవాడు అని అర్థం. అతను కిరీటం ధరిస్తాడా లేదా అన్నది అప్రస్తుతం. అతన్ని ఎవరయినా ఎప్పుడయినా రాజుగా, చక్రవర్తిగా సంబోధించారా లేదా అన్నది కూడా అనవసరం. ఒక వ్యక్తికి మరణ శిక్ష విధించగలిగే అధికారం ఉన్నట్లయితే అతను రాజు. మోషేకు అలాంటి అధికారం ఉండింది. సబ్బాత్ రోజున వంట చెరుకు ఏరుకుంటూ పట్టుబడ్డ

యూదుడిని, మోషే రాళ్ళు రువ్వి చంపించినదీ గుర్తుకు తెచ్చుకోండి (సంఖ్యా-15, 36). ఇంకా కొన్ని నేరాలకు మోషే ఆదేశాను సారం మరణ శిక్ష విధించినట్లు బైబిల్‌లో ప్రస్తావించబడింది. ముహమ్మద్‌కు కూడా తన పాలిత ప్రజలకు మరణదండన విధించడానికి లేదా వారిని కనికరించి వదలిపెట్టడానికి అధికారం ఉండింది. కేవలం ప్రవక్తా బాధ్యతలు మాత్రమే అప్పగించబడినవారి ప్రస్తావన కూడా బైబిల్‌లో ఉంది. వారు తమ ఆదేశాలను శాసనాలుగా చెలాయించే స్థితిలో లేకపొయ్యారు. ఆ పవిత్ర దైవ ప్రవక్తల్లో కొందరు తమకు ఎదురయిన మొండి తిరస్కార వైఖరి వల్ల నిస్సహాయ స్థితిలో ఉండేవారు. అలాంటివారిలో కొందరు వీరు: ప్రవక్త లోతు, యోజానా, దానియెలు, ఎజ్రా, బాప్తిస్మమిచ్చే యోహాను. వారు కేవలం తమ సందేశాన్ని అందజేశారు. కాని శాసనాన్ని అమలుజరపలేకపొయ్యారు. దైవ ప్రవక్త ఏసు కూడా దురదృష్టవశాత్తు ప్రవక్తల ఈ వర్గానికి చెందినవారే. క్రైస్తవ సువార్తలు దీన్ని ప్రస్ఫుటంగా ధృవీకరిస్తాయి. ఏసును రోమను గవర్నరు పొంటియస్ పిలాతు సమక్షంలో దేశద్రోహ నేరం క్రింద ఈడ్చుకుని పోతున్నప్పుడు, ఈ అబద్ధపు ఆరోపణను తిరస్కరించడానికి, తాను నిరపరాధి అని నిరూపించడానికి ఎంతో హేతుబద్ధ మయిన తిరస్కరించలేని విషయాన్ని ఉటంకించాడు ఏసు: "యేసు- నా రాజ్యము ఈ లోక సంబంధమయినది కాదు, నా రాజ్యము ఈ లోక సంబంధమయినదయితే నేను యూదులకు అప్పగింపబడకుండునట్లు నా సేవకులు పోరాడుదురు. గాని నా రాజ్యము ఇహ సంబంధమయినది కాదనెను." (యోహాను- 18:36)." ఇది (దేశ దిమ్మరుల జాతికి చెందిన) పిలాతును తృప్తి కలిగించింది. ఏసుకు మానసికారోగ్యం లేకపోయినప్పటికీ తన పరిపాలనకు ఆయన ఏదయినా కీడు కలిగించగలడన్నది మాత్రం సాధ్యంకాని విషయమని తోచిందతనికి. ఏసు కేవలం ఆధ్యాత్మిక రాజ్యాన్ని మాత్రమే తనదిగా ప్రకటించాడు. మరో మాటలో చెప్పాలంటే ఆయన తాను కేవలం ప్రవక్తనని ప్రకటించాడు. ఇది నిజమంటారా?" డొమినీ- "అవును"

అని బదులిచ్చాడు. అందువల్ల "ఏసు మోషేకు పోలినవాడు కాడు, మోషేకు పోలినవాడు ముహమ్మద్ ఒక్కరే."

## సరికొత్త శాసనం

(6) మోషే, ముహమ్మద్ తమ తమ అనుచర సమాజాల కోసం కొత్త ధర్మ శాస్త్రాన్ని, కొత్త నియమాలను తీసుకువచ్చారు. మోషే ఇస్రాయీలీలకు 10 ఆజ్ఞలనే కాదు, ఆ ప్రజల మార్గదర్శకత్వానికై సర్వసామాన్యమైన ధర్మ శాస్త్రాన్నీ అందజేశారు. ముహమ్మద్ అమానుషత్వంలోనూ, అజ్ఞానంలోనూ నిండుగా మునిగివున్న ప్రజల్లో ఆవిర్భవించారు. వారు తమ సవతి తల్లిని పెళ్ళాడేవారు, తమ కూతుళ్ళను సజీవంగా పూడ్చిపెట్టేవారు. మద్యపానం, వ్యభిచారం, జూదం, విగ్రహారాధనలు అక్కడ రాజ్యమేలాయి. ఇస్లామ్‌కు పూర్వం అరబ్బుల స్థితిగతుల్ని గిబ్బన్ తన గ్రంథం, **Decline and fall of Roman Empire** (రోమను సామ్రాజ్యపతనం)లో ప్రస్తావిస్తూ ఆ రోజుల్లో అరేబియన్ ప్రజల్లోని పశుత్వాన్ని, తతిమ్మా జీవరాసులతో వేరుచేసి గుర్తించడం చాలా కష్టమని చెబుతాడు. మనిషికీ, పశువుకీ మధ్య తేడా అన్నది చాలా తక్కువగా మిగిలింది. వారిని మనుషుల రూపంలో పశువులని అనవచ్చు.

"ఇలాంటి పశుప్రాయమయిన స్థితిలో నుండి ముహమ్మద్ వారిని ఉన్నతంగా లేవనెత్తాడు. థామస్ కార్లయిల్ మాటల్లో చెప్పాలంటే, వారిని ఆయన 'కాంతికి విజ్ఞానానికీ ధ్వజవాహకులు'గా మార్చాడు:"

"అరేబియాకు సంబంధించినంతవరకు అది చీకటి నుండి వెలుగులోకి సంభవించిన పుట్టుక లాంటిది. మొదటిసారిగా దాని ద్వారానే అరేబియా ప్రాణం పోసుకుంది. వారు ఆది నుండి ఎలాంటి గుర్తింపు లేకుండా అరేబియా ఎడారుల్లో దేశ దిమ్మరులుగా తిరుగుతూ ఉండిన నిర్భాగ్య గొర్రెల కాపరులు. ముహమ్మద్ ఆవిర్భావం తరువాత గుర్తింపులేనివారు విశ్వవిఖ్యాతలయ్యారు. అల్పులైనవారు విశ్వప్రముఖులయ్యారు, తరువాత ఒక్క శతాబ్దిలోనే

అరేబియాకు ఓ ప్రక్కన గ్రెనెడా (స్పెయిన్) అయితే, మరో ప్రక్కన ఢిల్లీ (ఇండియా) విలసిల్లింది. సమృద్ధమయిన అభివృద్ధీ భోగభాగ్యాలతోను, షోడష సంపదలతోనూ తులతూగుతూ మహా ప్రజ్ఞావంతుల జ్ఞానకాంతులతో అత్యధిక భూభాగాన అరేబియా దేదీప్యమానంగా వెలుగొందింది." 'అసలు జరిగిందేమిటంటే, ముహమ్మద్ అనుచర సమాజానికి ఓ సరికొత్త ధర్మశాస్త్రాన్ని ప్రసాదించాడు.'

ఏసుకు సంబంధించినంతవరకు, యూదులు ఆయన్ని గురించి తమ ధర్మశాస్త్రాలను బోధనలను మార్చివేసే వ్యక్తిగా భావించి అనుమానాలను వ్యక్తం చేసినప్పుడు ఏసు- తాను కొత్త మతాన్ని తీసుకురాలేదనే హామీనిచ్చేందుకు శాయశక్తులా కృషి చేశాడు. స్వయంగా ఆయన మాటల్లో చెప్పాలంటే: "ధర్మశాస్త్రమునయినను, ప్రవక్తల వచనములయినను కొట్టివేయవచ్చితినని తలంచవద్దు; నెరవేర్చుటకేగాని కొట్టివేయుటకు నేను రాలేదు. ఆకాశమును, భూమియు గతించిపోయిననేగాని ధర్మ శాస్త్రమంతయు నెరవేరువరకు దాని నుండి యొక పొల్లయినను, ఒక సున్నయైనను తప్పిపోదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను" (మత్తయి-5:17,18). మరో విధంగా చెప్పాలంటే "ఆయన కొత్త శాసనాంగాన్ని, నియమాలను తీసుకురాలేదు. పాత శాసనాలనే నెలకొల్పడానికి ఆయన వచ్చాడు. ఆయన యూదులకు బోధపరచడానికి ప్రయత్నం చేసింది ఇదే- ఆయన ఏదో మోసపుచ్చడానికి, యూదులు తన్ను దైవప్రవక్తగా అంగీకరించేందుకు ఏదో ఎత్తువేసి ఆ తరువాత ఓ కొత్త మతాన్ని సృజించి దాన్ని వారికి మింగుడుపడేలా చేసి ఒప్పించాలన్న వంచనా శిల్పంతో చెబితే తప్పు!- అలా వీల్లేదు. దైవ ధర్మాన్ని ఈ దైవ సందేశహరుడు తల్లకిందులు చేసే ఇలాంటి నీచమయిన పద్ధతిని అవలంబించడు. స్వయంగా ఆయనే దైవ ధర్మ శాస్త్రాన్ని అనుసరించాడు. మోషే అందజేసిన ఆజ్ఞల్ని పాలించాడు. సబ్బాత్‌ను గౌరవించాడు. ఒక్క యూదుడయినా అతన్ని పట్టి ఎప్పుడూ నీవు ఉపవాసమెందుకు ఉండటం లేదనిగాని, నీవు రొట్టె విరిచే ముందు నీ చేతులు ఎందుకు కడుక్కోవనిగాని నిలదీయలేదు. ఇలాంటి ఆరోపణలు వారు తరచుగా

ఆయన శిష్యులపై మోపుతూవచ్చారు. కాని స్వయంగా ఏసుపై ఎన్నడూ మోపలేదు. ఎందువల్లనంటే ఓ మంచి యూదునిగా ఆయన తనకు పూర్వపు ప్రవక్తలు తెచ్చిన ధర్మశాస్త్రాన్ని గౌరవించాడు. ఒక్క మాటలో చెప్పాలంటే ఆయన ఏ కొత్త మతాన్ని స్థాపించలేదు. కొత్త శాసనాన్నీ (షరీఅత్‌ను) అందజెయ్యలేదు- మోషే, ముహమ్మద్‌ల మాదిరిగా - ఏమంటారు?" నేను డొమినీని అడిగాను. అతను, "అవును, మీరనేది నిజమే" అన్నాడు. అప్పుడు నేనన్నాను, "అందువల్ల ఏసు మోషేలాంటి వాడుకాడు, మోషే లాంటివాడు ముహమ్మద్ ఒక్కడే."

## అంతిమ యాత్ర

(7) "మోషే మరియు ముహమ్మద్ ఇద్దరూ సహజమైన మరణం పొందారు. కాని క్రైస్తవం ప్రకారం ఏసును హింసాయుతంగా శిలువపై చంపడం జరిగింది. ఇది నిజమేనంటారా?" అని నేనడిగినదానికి డొమినీ, "అవును" అన్నాడు. నేనన్నాను, "అందువల్ల ఏసు మోషే లాంటివాడు కాడు, మోషే లాంటివాడు ముహమ్మద్ మాత్రమే."

## స్వర్గ నివాసం

(8) "మోషే ముహమ్మద్ ఉభయులూ భూమిలో ఖననం చెయ్య బడ్డారు. కాని మీరు నమ్మేదాని ప్రకారం ఏసు స్వర్గంలో విశ్రాంతి తీసుకుం టున్నాడు. ఇది నిజమా?" డోమినీ ఒప్పుకున్నాడు. నేను పలికాను, "అందువల్ల ఏసు మోషే లాంటి వాడు కాడు, మోషే లాంటివాడు ముహమ్మద్ ఒక్కడే."

## ఇస్మాయేలు - జ్యేష్ఠ కుమారుడు

పాపం డొమినీ నేను చెప్పే ప్రతి అంశాన్నీ నిస్సహాయంగా ఒప్పుకుంటూ పోతున్నాడు. అందువల్ల నేనిలా అన్నాను. "డొమినీ, ఇంతవరకు నేను చేసిందల్లా

ఆ భవిష్యద్వాణి జోస్యంలో నుండి కేవలం ఒక అంశాన్ని - నీవంటివాడు- నీకు పోలినవాడు- మోషేకు పోలినవాడు- అన్నదాన్ని రుజువు చెయ్యడం మాత్రమే కాదుగా, అందులో ఇంకా ఎంతో ఉంది. అందులో ఇలా ఉంది: 'వారి సహోదరులలో నుండి నీవంటి ప్రవక్తను వారి కొరకు పుట్టించెదను...' ఇందులో ముఖ్యమైన పదాలు 'వారి సహోదరులలో నుండి' అన్నవి. మోషేని, ఆయన జాతి యూదుల్ని ఒక ప్రత్యేక జాతిగా సంబోధించడం జరిగింది. వారి "సోదరులు" నిస్సందేహంగా అరబ్బులే కాగలరు. పరిశుద్ధ గ్రంథం బైబిలు అబ్రహామును దేవుని సన్నిహితుడుగా అభివర్ణిస్తుంది. అబ్రహాముకు ఇద్దరు భార్యలు-శారా, హాగరు. హాగరు వల్ల అబ్రహాముకు ఓ కొడుకు పుట్టాడు. అతను జ్యేష్ఠపుత్రుడు. "......" అబ్రహాము హాగరు కనిన తన కుమారునికి ఇష్మాయేలను పేరు పెట్టెను (ఆది-16:15). 'అప్పుడు అబ్రహాము తన కుమారుడైన ఇష్మాయేలును.....' (ఆది-17:23). 'అతని కుమారుడైన ఇష్మాయేలు గోప్యాంగ చర్మము సున్నతి చేయబడినప్పుడు అతడు పదమూడేండ్లవాడు' (ఆది-17:25). ఇష్మాయేలుకు 13 ఏండ్లు వచ్చినప్పటివరకు అతను అబ్రహామునకు ఏకైక పుత్రుడు. అబ్రహాము "విత్తనము" కూడా అబ్రహాముకు ఇస్సాకు అనే మరో కొడుకును శారా ద్వారా ప్రసాదిస్తాడు. అతడు తన అన్న ఇష్మాయేలు కన్నా చాలా చిన్నవాడు.

## అరబ్బులూ, యూదులు

ఇష్మాయేలూ ఇస్సాకు ఒకే తండ్రి అయిన అబ్రహాము కుమారులయి నప్పుడు వారిరువురు సోదరులు. అందువల్ల వారిలో ఒకరి సంతానం మరొకరి సంతానానికి సహోదరులన్న మాట. ఇస్సాకు సంతానం యూదులు. ఇష్మాయేలు సంతానం అరబ్బులు. అందువల్ల వారు పరస్పరం సహోదరులు. బైబిలు ధృవపరిచేదేమంటే, '..... అతడు (ఇష్మాయేలు) తన సహోదరులందరి యెదుట నివసించును...' (ఆది-16:12). '... అతడు తన సహోదరులందరి యెదుట

నివాసమేర్పరచుకొనెను' (ఆది-25:18). ఇస్సాకు సంతానం ఇష్మాయేలు సంతానానికి సోదరులు. అలాగే ముహమ్మద్, అబ్రహాము కొడుకయిన ఇష్మాయేలు సంతానంలోనివారు గనక ఆయన ఇస్రాయేలీయుల సహోదరుల లోనివాడు. ఇది ఆ జోస్యంలో ఉన్నదానికి సరిగ్గా సరిపోయింది. వారి సహోదరులలో నుండి! ఇక్కడ ఈ జోస్యం ఒక విషయాన్ని స్పష్టంగా చెబుతోంది, రాబోయే ప్రవక్త మోషేలా ఉండే ప్రవక్త ఇస్రాయేలు సంతానంలో ప్రభవించడు. 'వారిలో' కూడా జన్మించడు. వారి సహోదరుల్లో నుండి ఆవిర్భవిస్తాడు. అందువల్ల ముహమ్మద్ వారి సహోదరుల్లోనివాడు!

## నోటిలో మాటలు

ఆ జోస్యంలో ఇంకా ఇలా ఉంది. "........ అతని నోట నామాట నుంచుదును." .....అంటే అర్థమేమిటి? "నేను నా మాటను నీ నోటన వేస్తాను" అని మనం ఎప్పుడంటాము? నేను ప్రారంభంలో మీతో ద్వితీయోపదేశ కాండం, 18వ అధ్యాయం. 18వ వచనం తీసి చదవమని చెప్పగా మీరు చదివారే దాన్ని 'నా మాట మీ నోట వెయ్యడమని అంటామా?' దానికి డొమినీ "కాదు" అని సమాధానం ఇచ్చాడు. నేను ముందుకు సాగాను. "కాని నేను మీకు ఏదయినా మీకు తెలియని భాషను, అరబీ లాంటిదాన్ని, నేర్పాలంటే నేను పలికినట్టే మీరు కూడా పలకాలని, నేను చెప్పినట్లే వల్లించాలని చెబుతాను. ఉదాహరణకు నేనిలా ఒక్కొక్క మాటే చదవగా-

(1) **కుల్ హు వల్లాహు అహద్**
చెప్పండి, ఆయనే అల్లాహ్, ఒక్కగానొక్కడు

(2) **అల్లాహు స్సమద్**
అల్లాహ్ శాశ్వత సత్తాగలవాడు, నిరపేక్షాపరుడు.

(3) **లమ్ ఎలిద్; వలమ్‌యూలద్**
ఆయన ఎవరికీ తండ్రి కాడు, ఎవరికీ పుత్రుడుకాడు

(4) **వలమ్ యకున్‌లహూ కుఫువన్ అహద్**

ఆయనకు సరితూగేవారు మరే ఒక్కడూ లేడు.

**(దివ్యఖుర్ఆన్: 112-1-4)**

మీరు ఒక్కొక్క మాటే తిరిగి పఠిస్తే దాని భావమేమిటి? మీరెన్నడూ వినని అపరిచిత భాషలోని మాటల్ని మీరు వల్లించాలని నేను పలికితే- నేను "నా మాటను మీ నోట వెయ్యడం అంటే ఇదే కాదా?" డొమినీ నిజమేనని అంగీకరించాడు. అచ్చం ఇదే విధంగా దివ్య ఖుర్ఆన్‌లోని మాటల్ని, సర్వశక్తి మాన్యుడయిన ప్రభువు పంపిన దైవవాణిని ముహమ్మద్‌కు వహీ ద్వారా అందజెయ్యడం జరిగింది.

చరిత్ర ద్వారా తెలిసేదేమంటే, ముహమ్మద్‌కు నలభయ్యేళ్ళ ప్రాయంలో ఆయన మక్కా నగరానికి ఉత్తరాన మూడు మైళ్ళ దూరాన ఉన్న ఓ కొండ గుహలో ఉన్నాడు. అప్పుడు అది రమజాన్ నెల 27వ రాత్రి. ఆ గుహలో ప్రముఖ దైవదూత గాబ్రియేలు వచ్చి ఆయన్ని ఆయన భాషలోనే ఆదేశించాడు- "ఇఖ్రా" అని. అంటే- చదువు! లేక ప్రకటించు! లేక పఠించు! అని. ముహమ్మద్ అది వినగానే భయాక్రాంతుడై, **'మా అనా బికారి ఇన్'** అంటే 'నేను చదువుకున్నవాణ్ణి కాను' అని అంటారు. దైవదూత ఆయన్ని తిరిగి ఆదేశిస్తుంది, బదులుగా ఆయన అదే సమాధానం పలుకుతారు. మూడవసారి దైవదూత ఇలా పలుకుతుంది:

**ఇఖ్రా బిస్మి రబ్బిక ల్లజీ ఖలక్:**

అప్పుడు ముహమ్మద్ గ్రహిస్తారు తాను చెయ్యవలసిందేమిటో! కేవలం పలికినదాన్ని వప్పజెప్పడమే తన పని! ఆయన ఆ తరువాత తన నోట వెయ్యబడిన మాటల్ని ఒప్పజెబుతారు.

(1) **ఇఖ్రా, బిస్మి రబ్బిక ల్లజీ ఖలక్**

చదువు, సృష్టించిన నీ ప్రభువు పేరుతో.

(2) **ఖలకల్ ఇన్సాన మిన్ అలక్**
మనిషిని ఆయన రక్తపు ముద్దతో సృష్టించాడు.

(3) **ఇక్రా వ రబ్బుకల్ అక్రమ్**
చదువు, నీ ప్రభువు గొప్ప అనుగ్రహాలవాడు.

(4) **అల్లజీ అల్లమ బిల్ కలమ్**
ఆయన కలం ద్వారా (విద్య) నేర్పాడు.

(5) **అల్ల మల్ ఇన్సాన మా లమ్ యాలమ్**
మనిషికి, అతను ఎరగనిదాన్ని నేర్పాడు.

**(దివ్య ఖుర్‌ఆన్ - 96 : 1-5)**

ముహమ్మద్‌పై ప్రప్రథమంగా అవతరించిన అయిదు ఆయత్‌లివి. ఇవి ఇప్పుడు దివ్యఖుర్‌ఆన్‌లో 96వ సూరా ప్రారంభంలో చోటుచేసుకున్నాయి.

## విశ్వసనీయ సాక్షి

వెంటనే దైవదూత అదృశ్యమయ్యాడు. ముహమ్మద్ ఇంటికి వేగిరంగా వచ్చారు, భయంతో కంపిస్తూ చెమటతో తడిసి ఇంటికి చేరారు. తన ప్రియతమ భార్యను "నన్ను కప్పెయ్యి" అంటూ కోరుతూ పడుకున్నారు, ఆవిడ ఆయన్ని గమనిస్తూ కూచుంది. ఆయన కాస్త స్థిమితపడిన తరువాత తాను చూచిందీ, విన్నదీ ఆవిడతో చెప్పారు, ఆవిడ ఆయన్ని ఓదార్చి, అల్లాహ్ ఆయనకు ఎలాంటి హాని కలగజెయ్యడు అని ధైర్యవచనాలు పలికింది. అసత్యవాది ఎవరయినా ఇలా ఒప్పుకుంటాడా? వంచకుడయిన వ్యక్తి, తనకు దైవ దూత ఎదురయి దైవ సందేశాన్ని అందజేసినప్పుడు తాను భయవిహ్వాలుడయి చెమటలు కారుతుండగా తన భార్య వద్దకు పరుగెత్తుకుపోయానని ఒప్పుకుంటాడా? ఏ విమర్శకుడయినా ఆయన చేసిన క్రియల్ని, ప్రతిక్రియల్ని గమనించి ఆయన ఎలాంటివాడని చెప్పగలుగుతాడు? ఆయన ఓ నిజాయితీపరుడని, నిష్కపట

హృదయుడని, చిత్తశుద్ధి గలవాడని, సత్యస్వరూపుడయిన మనిషని ఒప్పుకోడూ? ఆయన్ని అల్ అమీన్- నిజాయితీపరుడు, రుజువర్తనుడు, విశ్వసనీయుడు, సత్యసంధుడు- అని ఒప్పుకోడూ?!

ఆ తరువాత 28 ఏళ్ళ వరకు దైవదౌత్య జీవితంలో "మాటలు" ఆయన నోట వెయ్యబడ్డాయి. ఆయన వాటిని తిరిగి పలికాడు. ఆ మాటలు ఆయన మనోమస్తిష్కాలపై చెరగని ముద్రవేశాయి. దివ్య గ్రంథం (ఖుర్‌ఆన్) ఘనపరిమాణం పెరిగేకొద్దీ ఆ సందేశ వచనాలు ఖర్జూరపుటాకులపై, తోలుపై, పశువుల ఎముకలపై వ్రాయబడేవి, ఆయన సహచరుల మనోఫలకాలపై ముద్రించబడేవి. ఆయన దివంగతుడయ్యే పూర్వమే అవన్నీ, నేడు మేము ఖుర్‌ఆన్‌ని చూస్తున్న తీరులో క్రమబద్ధంగా కూర్చబడ్డాయి.

"మాటలు (దైవ వాణి) వాస్తవానికి ఆయన నోట వెయ్యబడ్డాయి. అచ్చంగా పూర్వపు జోస్యంలో ఉన్నట్లు- అతని నోట నా మాటల నుంచుదును అన్నట్లు!"

## నిరక్షరాస్యుడయిన ప్రవక్త

"జబలున్నూర్" లేక "వెలుగు కొండ" అనే హిరా కొండ గుహలో ముహమ్మద్‌కు కలిగిన అనుభవం, ఆ తొలి దైవసందేశావతరణకు ఆయన పలికిన సమాధానం- అంతా బైబిల్‌లోని మరో జోస్యాన్ని నిజం చెయ్యడమే. యేషయా గ్రంథము 29వ అధ్యాయం, 12వ వచనం ఇలా అంటుంది! "మరియు - అది (గ్రంథము- అల్ కితాబ్ - అల్ ఖుర్‌ఆన్ -చదివేది, పారాయణం చేసేది) నీవు దయచేసి ('దయచేసి' అనే పదాలు హెబ్రూ ప్రతుల్లో లేవు. రోమను కాథలిక్కుల **Douay Version**తో పోల్చి చూడండి. ఇంకా **Revised Standard Version**తోనూ పోల్చి చూసుకోండి). దీన్ని చదవమని చెప్పి అక్షరములు తెలియని వానికి (అన్ నబియ్యుల్ ఉమ్మి- నిరక్షరాసి అయిన ప్రవక్త- దివ్య ఖుర్‌ఆన్ 7: 158) దానిని అప్పగించును. అతడు-

అక్షరములు నాకు తెలియవనును. ('అక్షరములు నాకు తెలియవు' అన్నది **"మా అనా బికారి ఇన్"**-నాకు చదవను రాదు- అన్న పదాలకు అనువాదం. ఈ పదాలనే ముహమ్మద్ గాబ్రియేలు దైవదూతతో రెండు సార్లు అన్నారు. దైవదూత ఆయన్ని "చదువుము: -"ఇక్రా!" అని ఆదేశించినప్పుడు) ఇక మొత్తం వచనాన్ని ఎలాంటి అంతరాయం లేకుండా చూద్దాము. "మరియు నీవు దయచేసి దీనిని చదువుమని చెప్పి అక్షరములు తెలియని వానికి దానిని అప్పగించును. అతడు - అక్షరములు నాకు తెలియవనును." **(యేషయా- 29 : 12)**

ముహమ్మద్ కాలంలో అంటే క్రీ.శ. 6వ శతాబ్దిలో అరబీలో బైబిల్ గ్రంథాలు లేవు అన్న విషయం గమనార్హమయింది. పైగా ఆయన పూర్తిగా నిరక్షరాసి; ఆయనకు ఏ మానవుడూ ఎన్నడూ ఒక్క అక్షరం ముక్క నేర్పలేదు. ఆయనకు బోధించినవాడు సృష్టికర్త అయిన స్వామియే.

**వమాయన్తికు అనిల్ హవా**
ఆయన తన ఇష్టమయిన రీతిలో ఏదీ మాట్లాడడు.
**ఇన్ హువ ఇల్లా వహ్‌య్యుం యూహ**
తనపై అవతరింపజెయ్యబడిన వహీ (దైవవాణి)ని తప్ప.
**అల్లమహూ షదీదుల్ కువ**
అతను అత్యంత శక్తి సామాన్యుడయినవాని ద్వారా నేర్చుకున్నాడు.
**(దివ్యఖుర్ఆన్- 53 : 3-5)**

ఎలాంటి మానవీయ చదువు సంధ్యలు లేకుండా 'ఆయన సకల విద్యాపారంగతుల విజ్ఞానానికి, విజ్ఞతకు సిగ్గుగొలిపే వివేకాన్ని, విజ్ఞతను ప్రదర్శించాడు.'

## తీవ్రమయిన హెచ్చరిక

"చూడండి." నేను డొమినీతో అన్నాను, "బైబిల్‌లోని జోస్యాలు ముహమ్మద్‌కు ఎలా సరిగ్గా సరిపోతాయో చూశారా? ముహమ్మద్‌కే అవి వర్తిస్తాయని చెప్పడానికి మనం జోస్యాలను సాగదీయవలసిన అవసరం లేదు."

డొమినీ ఇలా బదులిచ్చాడు, "మీరు చెప్పేదంతా బాగానే అనిపిస్తున్నాయి. కాని అవన్నీ అప్రస్తుతమయినవి. ఎందువల్లనంటే మేము క్రైస్తవులం. ఏసును దేవుని 'అవతార'మని నమ్ముతాము. ఆయన మమ్మల్ని పాపపు బంధనాల నుండి విముక్తి కలిగించాడు."

నేనడిగాను, "ఈ ఆధారాలకు, నిదర్శనాలకు ఏమాత్రం ప్రాముఖ్యం లేదా మీ దృష్టిలో? కాని దైవం అలా తలచలేదే! తన హెచ్చరికలు గ్రంథస్థమయి అందరి దృష్టిలోకి రావాలని ఆయన ఎంతగానో కోరుకున్నాడు. ఆయనకు తెలుసు, మీలాంటి చాలా మంది తన మాటల్ని తేలిగ్గా తీసుకుంటారని, తన మాటల్ని ఖాతరు చెయ్యరని; అందువల్ల ఆయన ద్వితీయోపదేశ కాండంలోనే 18:18లోని జోస్యానికి తరువాత ఇలా తీవ్రమైన హెచ్చరికతో సెలవిచ్చాడు. 'అతడు నా నామమున చెప్పు మాటలను విననివానిని దానిగూర్చి విచారణ చేసెదను.' (కాథలిక్కు బైబిల్‌లో చివరన **I will be the Revenger** - నేను పగ తీర్చుకుందును- అనే పదాలున్నాయి). దీనివల్ల మీకు భయం కలగడం లేదా? శక్తిసంపన్నుడయిన ప్రభువు ప్రతీకారం తీర్చుకుంటానని భయపెడుతున్నాడు. ఎవరయినా గూండా బెదిరిస్తేనే వణికిపోతామే, మీకు దైవం చేసే హెచ్చరిక పట్ల కూడా భయం కలగటం లేదా?

"అద్భుతాలకు మించిన అద్భుతమేమిటంటే, ద్వితీయోపదేశంలోని ఈ 19వ వచనంలో ముహమ్మద్‌కు సంబంధించిన మరో జోస్యం నిజమయ్యే నిరూపణ ఉంది. దాని పదాలను గమనించండి- '.... నా నామమున చెప్పు నా మాటలను....' ముహమ్మద్ ఎవరి నామంతో మాట్లాడుతున్నారు? నేను ఖుర్‌ఆన్‌ని తెరిచాను. 114వ అన్‌నాస్ సూరా- చివరి సూరా- తీశాను. దాని ప్రారంభంలోని సూత్రాన్ని చూపాను. 'బిస్మిల్లా హిర్రహ్మానిర్రహీమ్' అనే అరబీ అక్షరాలకు తెలుగు అనువాదం, అపార కృపాశీలుడు అనంత కరుణామయుడు అయిన అల్లాహ్ పేరుతో... ఆ తరువాత 113,112,111,110.... అన్ని సూరాల ప్రారంభంలో ఒకే సూత్రం "... కరుణామయుడయిన దైవం పేరుతో...."

జోస్యం చెబుతున్నదేమిటి? 'నా నామమున చెప్పు నా మాటను....' ముహమ్మద్ ఎవరి నామమున చెప్పుతున్నారు? అనంత కరుణామయుడయిన దేవుని నామమున జోస్యం ముహమ్మద్ విషయంలో అక్షరాలా నిజమయింది. దివ్య ఖుర్‌ఆన్‌లోని ప్రతి అధ్యాయం సూరా- ఒక్క 9వ సూరా మినహా- బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్- 'అపార కృపాశీలుడు అనంత కరుణామయుడయిన దైవం పేరుతో...' అన్న సూత్రంతోనే ప్రారంభమవుతుంది. ముస్లిమ్‌లు ప్రతి సత్కార్యాన్ని ఈ సూత్రంతోనే - దైవ నామంతోనే- ప్రారంభిస్తారు. కాని క్రైస్తవుల్లో- 'తండ్రి, కుమారుడు,పరిశుద్ధాత్మ పేరున' ప్రారంభిస్తారు.

ద్వితీయోపదేశ కాండంలోని 18:18వ వచనానికి నేను 15కు మించి హేతువుల్ని చూపాను- ఆ జోస్యం ముహమ్మద్‌కు ఎలా వర్తిస్తుందో, ఏసుకు ఎలా వర్తించదో అనడానికి.

## 'బాప్తిస్మమిచ్చు'వాడు ఏసును వ్యతిరేకించాడు

కొత్త నిబంధన కాలంలో యూదులు 'మోషే వంటివాని' కోసం ఇంకా ఎదురుచూస్తూనే ఉన్నారు. యోహాను సువార్త- 1:19-25 చూడండి. "'ఏసు యూదుల మెస్సయ్యాని నేనేనని ప్రకటించినప్పుడు, యూదులు, అయితే ఏలియా ఎక్కడ అని అడుగుతారు. యూదులకు మరో జోస్యం ఉండేది. దాని ప్రకారం, మెస్సయ్యా రాకకు పూర్వం ఏలియా తన రెండో రాకగా రావాలి. ఈ యూదు నమ్మకాన్ని ఏసు బలపరుస్తాడు కూడా. '....ఏలియా వచ్చి సమస్తమును చక్కపెట్టుననుమాట నిజమే; అయినను ఏలియా ఇదివరకే వచ్చెను. వారతనిని ఎరుగక, తమకిష్టము వచ్చినట్లు అతని యెడల చేసిరి.... అప్పుడాయన బాప్తిస్మమిచ్చు యోహానును గూర్చి తమతో చెప్పెనని శిష్యులు గ్రహించిరి." **(మత్తయి-17:11-13)**

కొత్త నిబంధన ప్రకారం యూదులు రాబొయ్యే మెస్సయ్యా మాటల్ని ఇట్టే నమ్మే రకం కాదు. తమ విచారణ ద్వారా ఎంతో ప్రయాసపడి నిజమయిన

మెస్సయ్యాను కనుగొనాలని వారు కృషి చేశారు. యోహాను సువార్త దీన్ని ధృవపరుస్తుంది: 'నీవెవడవని అడుగుటకు యూదుల యెరూషలేము నుండి యాజకులను, లేవీయులను యోహానొద్దకు పంపినప్పుడు అతడిచ్చిన సాక్ష్యమిదే. అతడు ఎరుగననక ఒప్పుకొనెను;- క్రీస్తును కానని ఒప్పుకొనెను.' (ఇది సహజమే, ఒకే కాలంలో ఇద్దరు మెస్సయాలు ఉండజాలరు. ఒకవేళ ఏసు 'క్రీస్తు' (మెస్సయ్యా) అయినట్లయితే యోహాను కూడా 'క్రీస్తు' కాజాలడు)'కాగా వారు -మరి నీవెవరవు, నీవు ఏలియావా అని అడుగగా అతడు- కాననెను. (ఇక్కడ బాప్తిస్మమిచ్చు యోహాను ఏసుకు వ్యతిరేకంగా మాట్లాడు తున్నాడు, ఏసు ఏమో యోహానే ఏలియా అనంటున్నాడు. యోహానేమో ఏసు తన్ను గురించి చెప్పేది నిజంకాదని చెబుతున్నాడు. వీరిద్దరిలో, ఏసు లేక యోహాను ఎవరో ఒకరు- దైవం మన్నించుగాక- నిస్సందేహంగా నిజం పలకడం లేదు! ఏసు సాక్ష్యమిచ్చినట్లు, బాప్తిస్మమిచ్చు యోహాను ఇస్రాయేలీయుల ప్రవక్తల్లో అందరికంటే గొప్పవాడు. 'స్త్రీలు కనిన వారిలో బాప్తిస్మమిచ్చు యోహాను కంటే గొప్పవాడు పుట్టలేదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను.....' (మత్తయి-11:11)

ముస్లిములైన మనం బాప్తిస్మమిచ్చు యోహానును హజ్రత్ యహ్యా (అలైహిస్సలామ్) అని అంటాము. ఆయన దేవుని నిజ ప్రవక్త అని కూడా నమ్ముతాము. ప్రవక్త ఏసును మేము హజ్రత్ ఈసా (అలైహిస్సలామ్) అని అంటాము. ఆయన్ని కూడా గొప్ప శక్తిమంతుడయిన దైవ సందేశహరునిగా గుర్తిస్తాము. వీరిరువురిలో ఎవరికయినా అబద్ధాన్ని ఎలా ఆపాదించగలము? ఏసు, యోహానుల మధ్య ఉత్పన్నమయిన ఈ సమస్యను మేము క్రైస్తవులకే వదిలేస్తున్నాము. ఎందుకంటే వారి పరిశుద్ధ గ్రంథాలు, వ్యత్యాసాలు, పరస్పర విరుద్ధ విషయాలతో నిండి ఉన్నాయి. వాటిని వారే ఏసు చెప్పిన చీకటి మాటలు (**Dark Sayings of Jesus**) అని అంటున్నారు. ముస్లిములయిన మాకు సంబం ధించినంతవరకు, యూదు పండితులు బాప్తిస్మమిచ్చు యోహానుకు వేసిన

చివరి ప్రశ్న వరకే మాకున్న శ్రద్ధ -'నీవు ఆ ప్రవక్తవా అని అడుగగా - కాన'ని ఉత్తరమిచ్చెను. **(యోహాను-1:22)**

## మూడు ప్రశ్నలు

గమనించవలసిన విషయమేమంటే, మూడు వేర్వేరు ప్రత్యేకమైన ప్రశ్నలు వారు బాప్తిస్మమిచ్చు యోహానుకు వేశారు. వాటికి మూడు సార్లూ నిక్కచ్చిగా 'కాదు' అని సమాధానాలిచ్చాడు ఆయన.

(1) నీవు క్రీస్తువా?

(2) నీవు ఏలియావా?

(3) నీవు ఆ ప్రవక్తవా?

కాని క్రైస్తవ పండితులు ఏ విధంగానో ఇక్కడ కేవలం రెండు ప్రశ్నలు మాత్రమే అడగటం జరిగిందని వాదిస్తారు. యూదులు బాప్తిస్మమిచ్చు యోహానును ప్రశ్నించినప్పుడు వారి ఆంతర్యాల్లో మూడు వేర్వేరు జోస్యాలుండేవనడాన్ని స్పష్టంగా రూఢీపరచుకునేందుకు ఆ తరువాత వచనంలోనే యూదు పండితులు వేసిన ప్రశ్నను పరిశీలిస్తే బోధపడుతుంది.

వారు-
నీవు క్రీస్తువయినను
ఏలియావయినను
ఆ ప్రవక్తవయినను
కాని ఎడల,
ఎందుకు బాప్తిస్మమిచ్చుచున్నావు...? **(యోహాను 1:25)**

దీన్నిబట్టి తెలిసేదేమంటే యూదులు మూడు జోస్యాలు నెరవేరాలని ఎదురుచూస్తున్నారు. ఒకటి, క్రీస్తు (మెస్సయ్యా) రాక; రెండు, ఏలియా రాక; మూడు, ఆ ప్రవక్త రాక.

## "ఆ ప్రవక్త"

రిఫరెన్సులు, అధఃస్సూచనలున్న ఏ బైబిల్‌ని మనం చూసినా ఆ సూచనల్లో 'ఆ ప్రవక్త' అన్న పదం యోహాను 1:25లో వచ్చే చోట ఒక సూచన ఉంటుంది. దాని ప్రకారం 'ఆ ప్రవక్త' అన్న పదాలు ద్వితీయోపదేశ 18:15,18లోని జోస్యానికి సంబంధించినవని ఉంటుంది. ఆ ప్రవక్త లేక నీవంటి ప్రవక్త - మోషే వంటి ప్రవక్త- ముహమ్మద్ మాత్రమేనని, ఏసు మాత్రం కాదని మేము అఖండనీయంగా రుజువు చేశాము.

ముస్లిములమయిన మేము ఏసును 'మెస్సయ్యా' లేక దాని అనువాద మయిన 'క్రీస్తు' కాదని అనడం లేదు. మేము పాత నిబంధనలోని మెస్సయ్యా రాకకు సంబంధించిన వెయ్యిన్నొక్క జోస్యాలను కూడా కాదనడం లేదు. మేము చెప్పేదల్లా ద్వితీయోపదేశం 18 : 18లోని జోస్యం ఏసుక్రీస్తును సూచించదని, అది అతి ప్రస్ఫుటంగా మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)కు సంబంధించిందని మాత్రమే.

డొమినీగారు, నా చర్చ చాలా ఆసక్తికరంగా ఉందంటూ ఒప్పుకుని ఈ విషయాన్ని తాను ఏర్పరిచే ఒక మీటింగులో వచ్చి నేను చర్చించాలని కోరాడు. ఆ విధంగా నన్ను మృదువుగా సాగనంపాడు. దాదాపు 15 సంవత్సరాలు దాటాయి. ఇంత వరకు డొమినీ ఆహ్వానానికై ఎదురుచూస్తూనే ఉన్నాను. నా ముందు అలా కోరిక వెలిబుచ్చినప్పుడు డొమినీ పాపం చిత్తశుద్ధితోనే ఆహ్వానించి ఉంటాడు. కాని తరువాత దురభిమానాలు, ద్వేషాలు అడ్డువచ్చి ఉంటాయి.

## నికార్సయిన పరీక్ష

క్రీస్తు గొర్రెలతో నేను చెప్పేదేమంటే, గురువుగారు చెప్పిన అగ్ని పరీక్షను ఎందుకు పెట్టరాదు అని. నేను ప్రవక్తనని ఎవరు ప్రకటించినా ఈ పరీక్షను పెట్టాలని ఆయన అన్నారు: "వారి ఫలముల వలన మీరు వారిని తెలుసు

కొనుదురు. ముండ్ల పొదలలో ద్రాక్ష పండ్లయినను, పల్లేరు చెట్లను, అంజూరపు పండ్లనయినను కోయుదురా? అలాగుననే ప్రతి మంచి చెట్టు మంచి ఫలములు ఫలించును, పనికిమాలిన చెట్టు కాని ఫలములు ఫలించును..... మీరు వారి ఫలముల వలన వారిని తెలిసికొందురు.'' (మత్తయి 7:16-20)

మీరు ఈ పరీక్షను ముహమ్మద్ బోధనలకు వర్తింపజెయ్యడానికి భయపడతారు దేనికి? అప్పుడే ప్రవక్త మోషే ప్రవక్త ఏసు చెప్పిన వచనాలు నిజంగా నెరవేరడమనేది దేవుని అంతిమ నిబంధన దివ్య ఖుర్‌ఆన్ ద్వారానే సాధ్యమని తద్వారానే ప్రపంచానికి ఇతోధికంగా కావలసిన శాంతిసుఖాలు ప్రాప్త మవుతాయనే మీరు తెలుసుకుంటారు. ''ముహమ్మద్ లాంటి మనిషి ఆధునిక ప్రపంచానికి నియంతగా పరిపాలనా భారం తీసుకుంటే నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించి ఎంతో కొరవడిన శాంతిసుఖాలు ప్రపంచానికి అందజెయ్యగలడు.'' (జార్జ్ బెర్నార్డ్ షా)

## ఎంతో గొప్ప మహనీయులు

''ప్రపంచ చరిత్రలో మహనీయుడయిన నాయకుడెవరు?'' అన్న అంశంపై ''టైమ్'' వారపత్రిక తన, 1974 జులై 15వ తేది సంచికలో ప్రపంచం లోని విభిన్న చరిత్రకారులు, రచయితలు, సేనాపతులు, వాణిజ్యవేత్తలు ఇంకా ఇతర వ్యక్తుల అభిప్రాయాలను సేకరించింది. కొందరు అది హిట్లర్ అని అన్నారు. మరి కొందరు గాంధీ అని, బుద్ధుడని, లింకన్ అని ఇంకా ఏమిటేమిటో అన్నారు. కాని జూలెస్ మాస్సర్ మాన్, యునైటెడ్ స్టేట్సుకు చెందిన ప్రముఖ మానసిక శాస్త్రవేత్త, గొప్ప నాయకుణ్ణి నిర్ణయించడానికి కావలసిన ప్రమాణాలను, సరయిన కొలబద్దల్ని అందజేశాడు. నాయకుడన్నవాడు మూడు అవసరాలను నెరవేర్చాలని అన్నాడాయన:

(1) తన అనుయాయుల సంక్షేమానికి, సముద్ధరణకు కృషి చెయ్యాలి.

(2) ప్రజలకు భద్రతా భావాన్నిచ్చే సామాజిక వ్యవస్థ సమకూర్చాలి.

(3) ప్రజలకు అవసరమైన విశ్వాసాల సముదాయాన్ని అందజెయ్యాలి.

పైన పేర్కొన్న మూడు ప్రమాణాలతో ఆయన మొత్తం మానవ చరిత్రను పరిశోధించి విశ్లేషించాడు. హిట్లర్, పాశ్చర్, సీజర్, మోషే,కన్‌ఫ్యూషస్ ఇంకా ఇతర చాలా మందిని పరిశీలించి చివరన అన్నాడు:

"పాశ్చర్, సాల్క్ లాంటి మనుషులు మొదటి కోవకు చెందిన నేతలు. గాంధీ, కన్‌ఫ్యూషస్, ఓ ప్రక్కన, అలెగ్జాండర్, సీజర్, హిట్లర్, మరో ప్రక్కన రెండో కోవకు, మూడో కోవకు చెందిన నాయకులు, ఏసు, బుద్ధుడు మూడో వర్గానికి చెందిన వారు. కాని సర్వకాలాలకుగాను అత్యంత మహనీయుడయిన నాయకుడు బహుశా ముహమ్మద్ ఒక్కడేనేమో! ఈయన మూడు అంశాలనూ తనలో ఇనుమడించుకున్నాడు. ఆ తరువాత కొంత తగ్గు స్థాయిలో మోషే కూడా అదే చేశాడు."

షికాగో యూనివర్శిటీకి చెందిన ఓ ప్రొఫెసర్- అతను బహుశా యూదుడనుకుంటూ- నిర్ణయించిన కొన్ని కొలబద్దలననుసరించి- మానవాళికి లభించిన గొప్ప నాయకుల్లో ఏసు, బుద్ధుడు ఎవరూ ఏ మూలనా కానరారు. కాని ఆయన యాదృచ్ఛికంగా ఆ కొలమానాలకనుగుణంగా ముహమ్మద్‌ని, మోషేని ఒకటిగా చేసి చూపుతున్నాడు. ఇది, ఏసు, మోషే వంటివాడు కాదు, ముహమ్మద్ ఒక్కడే మోషేవంటివాడు అన్న వాదానికి మరింత బలం చేకూర్చుతుంది- ద్వితీయోపదేశం: 18 : 18- నీవంటి - మోషేవంటి ప్రవక్త ! చివరన నేను ఒక క్రైస్తవ ఫాదరి, బైబిల్ వ్యాఖ్యాత మాటల్ని, దానితోపాటు ఆయన గురువు మాటల్ని చెప్పి ముగిస్తున్నాను.

"ఓ నిజమయిన ప్రవక్త అంతిమ నిర్ధారణ, కొలబద్ధ, అతని బోధనల్లోని నైతిక స్వరూప స్వభావాలే." (ప్రొ. డుమ్మెలో)

"మీరు వారి ఫలముల వలన వారిని తెలిసికొందరు." (ఏసుక్రీస్తు)

# రండి, హేతుబద్ధంగా ఆలోచిద్దాం

చెప్పండి : "ఓ గ్రంథవహులారా!

రండి, మీకూ మాకూ మధ్యన సమంగా వర్తించే విషయం వైపునకు.

మనం దైవం తప్ప మరెవరినీ ఆరాధించరాదని ఆయనతోపాటు మరెవరినీ ఆయనకు సహవర్తులుగా ఎంచరాదని.

మనలో ఏ ఒక్కరూ దైవాన్ని కాదని మరొకరిని తన ప్రభువుగా చేసుకోరాదని."

ఈ పిలుపును స్వీకరించడానికి వారు విముఖులయితే స్పష్టంగా చెప్పండి, "మీరే సాక్షులు, మేమైతే ముస్లిములము మాత్రమే (కేవలం దైవ దాస్యం, విధేయతలు పాటించేవారు)." (దివ్యఖుర్‌ఆన్: 3:64)

యూదులకు, క్రైస్తవులకు దివ్యఖుర్‌ఆన్‌లో ఇచ్చిన గౌరవ ప్రదమయిన బిరుదు 'గ్రంథవహులు' అన్నది. వారిని ఆహ్వానించాలని ముస్లిములను ఆదేశించడం జరిగిందిక్కడ- ఓ గ్రంథవహులారా- ఓ విద్యావంతులారా, దైవవాణిని గ్రహించామని చెప్పుకునే ఓ ఘనులారా! దివ్య గ్రంథాలుగల వారలారా! రండి, మనమంతా ఒకటయి ఓ ఉమ్మడి వేదికను అనుసరిద్దాం: మనం దైవం తప్ప మరెవరినీ ఆరాధించమని! ఎందుకంటే ఆరాధనకు అర్హుడు దైవం తప్ప మరెవరూకారు గనుక- కాని, "ఏలయనగా నీ దేవుడనయిన యెహోవానగు నేను రోషము గల దేవుడను; నన్ను ద్వేషించువారి విషయములో మూడు నాలుగు తరముల వరకు, తండ్రుల దోషమును కుమారుల మీదికి రప్పించుచు" (నిర్గమ 20:5) అనే కారణం వల్ల మాత్రం కాదు- కేవలం ఆయనే మన ప్రభువు, మన పరిపోషకుడు, మన పరిపాలకుడు, పెంచేవాడు, సకల స్తోత్రములకు అర్హుడు, ఆరాధనలకూ, భక్తిప్రపత్తులకు తగినవాడు అయినందువల్లనే!

సూత్రప్రాయంగా చెప్పినప్పుడు యూదులైనా, క్రైస్తవులైనా పైన ఖుర్‌ఆన్‌లో పేర్కొన్న మూడు ప్రతిపాదనలనూ అంగీకరిస్తారు. కాని ఆచరణలో దాన్ని ఆదరించరు. ఒకే ఒక నిజదైవానికి సంబంధించిన విశ్వాసంలో గల అనేక సైద్ధాంతిక పొరపాట్లుకాక పౌరహిత్యపు ప్రశ్న కూడా ఈ సందర్భంలో వస్తుంది. (యూదుల్లోనైతే ఈ వ్యవస్థ వారసత్వంగా కూడా వచ్చేది). కేవలం ఓ మానవమాత్రుడు కాహిన్, పోపు, ఫాదరి, బ్రాహ్మణ పూజారి తన విజ్ఞానం విషయంలోనూ, తన వ్యక్తిగత జీవితంలో పరిశుద్ధత విషయంలోనూ ఎన్ని లోపాలున్నా ఇతరులపై తన ప్రాధాన్యత ప్రకటిస్తూ మనిషికీ దైవానికీ మధ్య ప్రత్యేక భావంలో విశేష ప్రతిపత్తితో నిలిచేవాడుగా చెలామణి అవుతున్నాడు, ఇస్లామ్ ఎలాంటి పౌరహిత్యాన్నీ అనుమతించదు.

ఇస్లామీయ విశ్వాసాన్ని ఒక్క మాటలో దిగువన పేర్కొంటున్నాము: చెప్పండి: "మేము విశ్వసిస్తున్నాము అల్లాహ్‌ను, మాపై అవతరించిన మార్గదర్శకత్వాన్ని, అది అబ్రహామ్‌పై, ఇష్మాయేలుపై, ఇస్సాకుపై, యాకోబుపై యాకోబు సంతతిపై కూడా అవతరించింది. మోషేకు, ఏసుకు కూడా ప్రదానం చెయ్యబడింది. ఇంకా దైవ ప్రవక్త లందరికీ ఇవ్వబడింది. మేము వీరి మధ్య ఎలాంటి వ్యత్యాసాన్ని పాటించము. మేము అల్లాహ్‌కు మమ్మల్ని మేము సమర్పించుకునే ముస్లిములము."

(దివ్యఖుర్‌ఆన్ 2:136)

ముస్లిముల పరిస్థితి ప్రస్ఫుటంగా ఉంది. ముస్లిములు తమకే సొంతమైన మతం తమకు ఉందని వాదించరు. ఎలాంటి వర్గానికి సంబంధించిన మతం కాదు ఇస్లామ్. దాని దృష్టిలో మతం అన్నది ఒక్కటే- ఎందుకంటే సత్యం అన్నది ఒక్కటే. పూర్వపు ప్రవక్తలందరూ బోధించినది ఆ ఒక్క మతమే (దివ్య ఖుర్‌ఆన్, 42: 13) దైవ గ్రంథాలన్నీ బోధించిన సత్యం

అదే. ఒక మాటలో చెప్పాలంటే అది, దేవుని అభీష్టాన్నీ, ఆయన పథకాన్ని గుర్తించి బుద్ధిపూర్వకంగా ఆ అభీష్టానికీ, పథకానికీ స్వయం సమర్పణ చేసుకోవడం. ఎవరయినా దీన్ని కాదని మరే విధానాన్ని అవలంబించినా అతను తన నైజానికే ప్రతికూలంగా ప్రవర్తిస్తున్నాడన్న మాట. ఎందుకంటే అతను దేవుని అభీష్టానికీ, ఆయన ప్రతిపాదనకూ భిన్నంగా ప్రవర్తిస్తున్నాడు, అలాంటి వాడు దైవ మార్గదర్శకత్వం లభిస్తుందని ఆశించలేడు- అతను స్వయంగానే బహిరంగంగా దైవ మార్గదర్శకత్వాన్ని తృణీకరించాడు.

-: సమాప్తం :-